నల్లమలలో ఆక్రమణలకు అడ్డుకట్ట!

అటవీ భూముల్లో విస్తృతంగా మొక్కల పెంపకం



ఎర్రగట్టు బొల్లారం శివారులో మొక్కలు నాటుతున్న సిబ్బంది

కొల్లాపూర్, న్యూస్‌టుడే: అటవీ భూముల ఆక్రమణల నివారణకు అటవీశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో విస్తరించిన నల్లమల అడవుల అభివృద్ధిలో భాగంగా కొల్లాపూర్ రేంజ్ పరిధిలో విస్తృతంగా మొక్కల పెంపకం చేపడుతున్నారు. ఆక్రమిత భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకొని మొక్కల పెంపకానికి సిద్ధం చేస్తున్నారు.

ఎక్కడెక్కడ..: కృష్ణా నది పరివాహక ప్రాంతం, వాగులకు సమీపంలోని అటవీప్రాంతాల్లోనూ మొక్కల పెంపకం చేపట్టనున్నారు. ప్రస్తుతం నల్లమలలోని ఎర్రగట్టుబొల్లారం శివారులో మొలచింతలపల్లి వాగు సమీపంలో 25 ఎకరాల్లో మొక్కలు నాటారు. వీటి పరిరక్షణకు చర్యలు చేపడుతున్నారు. మిగతా అటవీ భూముల్లో ప్రధానంగా తీరప్రాంతాలైన అమరగిరి, సోమశిల, మల్లేశ్వరం, మంచాలకట్ట, తదితర గ్రామాల్లో నదీ తీర ప్రాంతంలోని అటవీశాఖ భూముల్లో మొక్కల పెంపకం చేపట్టనున్నట్లు అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల ప్రజలకు అడవుల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. చెట్లను నరకకుండా నిఘా తీవ్రతరం చేశారు. ముక్కిడిగుండం, మారెడ్‌మాన్‌దిన్నె, నార్లాపూర్ తదితర గ్రామాల్లో చెట్లు నరికి పంట సాగు చేసిన పలువురిపై ఇప్పటికే 20 కేసులు నమోదయ్యాయి. ఈ సమస్యపై కొల్లాపూర్ రేంజ్ అధికారి చంద్రశేఖర్ స్పందిస్తూ.. హక్కుపత్రాలు ఉన్న పోడుభూముల్లో పంటలు సాగు చేసుకోవాలన్నారు. కానీ అటవీశాఖకు చెందిన భూముల్లో అక్రమ సాగు చేసే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ. 2,306

అచ్చంపేట, న్యూస్‌టుడే: అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న క్రయ విక్రయాలు కొనసాగుతున్నాయి. బుధవారం వివిధ గ్రామాలకు చెందిన 25 మంది రైతులు 447 క్వింటాళ్ల (894 బస్తాలు) మొక్కజొన్న ధాన్యం అమ్మకానికి మార్కెట్‌కు తెచ్చారు. తేమ శాతాన్ని పరిశీలించి మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ. 2,306 మాదిరి ధర రూ. 2,150 కనిష్ఠ ధర రూ. 1,411 వంతున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారని మార్కెట్ కార్యదర్శి నరసింహులు తెలిపారు.

గవర్నర్‌ను కలిసిన పీయూ ఉపకులపతి

పాలమూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను పాలమూరు విశ్వ విద్యాలయం నూతన ఉపకులపతి జీఎన్ శ్రీనివాస్ హైదరాబాద్ రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతో పాటు పలు విశ్వ విద్యాలయాల ఉపకులపతులు బుధవారం గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపకులపతి జీఎన్ శ్రీనివాస్

నక్షా.. భూమి లెక్క పక్కా!

పైలట్ ప్రాజెక్టుగా జడ్చర్ల



ఈనాడు, మహబూబ్‌నగర్: గ్రామాల్లో వ్యవసాయ భూముల వివరాలు నక్షాలో పకడ్బందీగా ఉంటాయి. పట్టణాల్లో ఆ వ్యవస్థ లేకపోవడంతో ఇష్టారీతిన భూ ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇతరత్రా భూ సమస్యలు ఎదురవుతున్నాయి. ఇలాంటి ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు పట్టణ భూములకూ నక్షాను అందుబాటులోకి తీసుకురానున్నారు. కేంద్రం పైలట్ ప్రాజెక్ట్‌గా దేశంలోని దాదాపు వంద మున్సిపాలిటీలను ఎంపిక చేయగా రాష్ట్రం నుంచి ఎనిమిది ఉన్నాయి. వీటిలో పాలమూరు నుంచి జడ్చర్ల మున్సిపాలిటీ ఎంపికైంది. త్వరలోనే పట్టణంలో సర్వే ప్రారంభం కానుంది.

సర్వే చేపట్టి.. : భూముల వివరాలను నక్షాలో పొందుపర్చేందుకు సర్వే చేపట్టి పటాలు(మ్యాప్స్) రూపొందించనున్నారు. సర్వే ఆఫ్ ఇండియా, పురపాలక, భూమి కొలతలు దస్త్రాల నిర్వహణ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేపట్టనున్నాయి. కేంద్ర పథకం నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ హ్యాబిటేషన్స్(ఎన్ఏకేఎస్‌హెచ్) కింద పట్టణాలకు నక్షా తయారు చేయనున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే సర్వే ఆఫ్ ఇండియా డ్రోన్లతో ఎంపికైన పట్టణాల్లో ఛాయాచిత్రాలు రూపొందిస్తోంది. అనంతరం ఆయా శాఖలు సంయుక్త సర్వే చేపట్టనున్నాయి. ఇళ్లు, భూములు, ఆస్తిని పక్కాగా నమోదు చేస్తారు. అక్షాంశాలు, రేఖాంశాలతో ఆస్తుల హద్దులు గుర్తిస్తారు. వాటి విస్తీర్ణాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తారు. ఇల్లు, ఆస్తికి ప్రాపర్టీ కార్డులను కూడా జారీ చేయనున్నారు.

జడ్చర్ల మున్సిపాలిటీ జనాభా: సుమారు లక్ష
వార్డులు: 27
పట్టణంలోని భవనాల సంఖ్య: 11 వేలు

కబ్జాల కట్టడి.. : జడ్చర్ల పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండటం, పట్టణం మీదుగా జాతీయ రహదారి వెళ్లడం, హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం తదితర సానుకూలాంశాల వల్ల ఇక్కడి భూములకు డిమాండ్ పెరిగింది. అక్రమార్కులు ఇక్కడి ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. నక్షాలో ప్రతిదానికి డిజిటల్ హద్దులు నిర్ధారిస్తారు. దీనివల్ల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయవచ్చు. ● జడ్చర్ల పురపాలికలోని నల్ల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దారు. దీని బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలో కొందరు అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో వెంచర్లలో చెరువు నీరు నిండిపోతోంది. కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. పరిసరాల్లో కొన్ని నిర్మాణాలు కూడా చేశారు. ● పట్టణంలోని ఊర చెరువు, నల్లకుంట, ఊరకుంట చెరువులు కబ్జా అయ్యాయి. ● బూరెడ్డిపల్లిలో కొన్ని సర్వే నంబర్లలో ప్రభుత్వ భూములు, గుట్టలున్నాయి. వాటి పరిధిలో ఎలాంటి తవ్వకాలు, గనుల ఏర్పాటు, పేలుళ్లు చేపట్టకూడదు. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ వెంచర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములను కలిపేసుకుంటున్నారు. యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు.

● కోసిగుట్ట సమీపంలోనూ కుంటలు, ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నాయి. సర్వే ద్వారా ఈ అక్రమాలు వెలుగు చూస్తాయి.

● బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలో 14 ఎకరాల స్థలం ఉంది. అందులో మార్కెట్ కార్యాలయం, షెడ్లు, ఇతర నిర్మాణాలున్నాయి. రైతులు ఇక్కడికి ధాన్యం, పంట ఉత్పత్తులు తీసుకొచ్చేందుకు 100 అడుగుల విశాలమైన రహదారులుండాలి. మార్కెట్ చుట్టూ నిర్మాణాలు చేస్తున్నారు. ఆ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. రైతులు రాకపోకలు, వాహనాల నిలిపేందుకు స్థలాలు కరవయ్యాయి. రహదారులు ఇరుకుగా మారాయి.

● పట్టణ భూములు, ఆస్తుల సర్వే నిర్వహణకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు. సర్వే వల్ల భూముల లెక్కలు పక్కాగా నమోదవుతాయి. భూ సమస్యలను నివారించవచ్చు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే, వాటిని అనుసరించి సర్వే చేపడతాం.
- నవీన్, ఆర్డీఓ మహబూబ్‌నగర్

ఏడాదిగా జాడలేని నిధులు

ఆరోగ్య మిషన్ అమలులో నిర్లిప్తత

న్యూస్‌టుడే- నారాయణపేట



నారాయణపేట: కొల్లంపల్లిలో నిరుపయోగంగా పల్లె దవాఖానా

ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ కింద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఏటా రూ.కోట్లలో నిధులు సమకూరుస్తోంది. జిల్లాల వారీగా వైద్య ఆరోగ్యశాఖకు ఈ నిధులు బదిలీ చేస్తారు. ఏడాదిగా నిధుల మంజూరులో తీవ్ర నిర్లిప్తత నెలకొంది. ఆరోగ్యమిషన్ నిధులను ప్రతి జిల్లా ఆస్పత్రి, సీహెచ్‌సీలకు రూ. 4.50లక్షల చొప్పున, పీహెచ్‌సీకి రూ. 1.75 లక్షలు మంజూరు చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ప్రతి జిల్లాకు ఏటా కార్యక్రమాల నిర్వహణకు రూ. 3కోట్ల నుంచి రూ. 5కోట్ల వరకు నిధుల మంజూరు చేయాల్సి ఉంది. ఇంతే కాకుండా ఆస్పత్రుల భవనాలకు, ఇతర కార్యక్రమాలకు అదనపు నిధులు పరిస్థితుల మేరకు వెచ్చిస్తారు. నిధుల్లేక ఏ కార్యక్రమం నిర్వహించాలన్న ఆరోగ్యశాఖ తలలు పట్టుకోవాల్సి వస్తోంది.

జననీ సురక్ష, శిశు యోజన...: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సందర్భంలో మందుల కొనుగోలుకు ఇది వరకు ఒక్కో కేసుకు రూ. 1600లు ఖర్చుచేసేవారు. భోజనం ఖర్చుల కింద రోజుకు రూ.వంద వరకు వెచ్చించాలి. సాధారణ ప్రసవానికి మూడు రోజులు, శస్త్ర చికిత్స జరిగితే ఏడు రోజులకు చెల్లించేవారు. కేసీఆర్ కిట్ పేరు మార్చినా నిధులు అందని పరిస్థితి ఉంది.

ఇదీ పరిస్థితి

జిల్లా	పీహెచ్‌సీలు
మహబూబ్‌నగర్	17
నారాయణపేట	11
నాగర్‌కర్నూల్	23
జోగులాంబ గద్వాల	10
వనపర్తి	14

పారిశుద్ధ్యం అంతంతే: 5వేల జనాభా ఆధారంగా ఆరోగ్య ఉపకేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటి నిర్వహణకు జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి యేటా నిధులు మంజూరవుతాయి. ఒక్కో కేంద్రానికి రూ. 10వేలు కేటాయిస్తారు. కేంద్రం పరిధిలో పారిశుద్ధ్యం, ఇతరత్ర సౌకర్యాలకు నిధులను వినియోగించాల్సి ఉంటుంది. ఏడాదిగా పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది.

కొనసాగని కు.ని శిబిరాలు...: కు.ని శిబిరాల నిర్వహణ, అవసరమైన వసతులు , శస్త్రచికిత్స చేసుకున్న మహిళలకు రూ. 800, పురుషులకు రూ. 1100 ప్రోత్సాహకం అందజేసేవారు. నిధుల లేమితో రెండేళ్లుగా కు.ని శిబిరాలు నిర్వహించడంలేదు.

పీహెచ్‌సీలలో వసతులు కరవు....: మిషన్ నిధుల జాడలేకపోవడంతో ఆస్పత్రి కమిటీలు ఉత్సాహంగా పనిచేయడం లేదు. వైద్యాధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేక సమావేశాలే జరగడం లేదు. పీహెచ్‌సీలలో ఏ చిన్న సమస్య వచ్చినా సొంత ఖర్చులతో నెట్టుకొస్తున్నామని పలువురు వైద్యాధికారులు వాపోతున్నారు.

14 రకాల కార్యక్రమాలు

1 శిశు, మాతృ మరణాల రేటు తగ్గించడం
2. పారిశుద్ధ్యం మెరుగుపరచడం
3. అంటువ్యాధుల నివారణ
4. అసంక్రామిక వ్యాధులపై దృష్టి
5. మలేరియా, డెంగీ రాకుండా చూడటం
6. మరణాల తగ్గింపు
7. కుష్ఠు, క్షయవ్యాధి నివారణ
8. పిల్లల ఆరోగ్యం
9. సార్వత్రిక వ్యాధి నిరోధక సేవలు
10. వ్యక్తిగత పరిశుభ్రత పెంపు
11. కీటక జనిత వ్యాధుల నివారణ
12. కుటుంబ సంక్షేమం
13. గర్భిణుల ఆరోగ్యం
14. బాలింత సంరక్షణ

నిలిచిన ఉపకేంద్రాల నిర్మాణాలు...: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 352 ఆరోగ్య ఉపకేంద్రాలకు ఒక్కో భవనానికి రూ. 16లక్షల నుంచి రూ. 20లక్షలకుపైగా నిధులు కేటాయించారు. వీటిలో 94 భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, 30 నిర్మాణాలు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. నిధుల కొరతతో పనులకు నోచుకోవడం లేదు. పూర్తైన భవనాలను గుత్తేదారులు నిధులు రాలేదని వైద్య ఆరోగ్యశాఖకు అప్పగించడంలేదు.

భారాస పాలనలో అప్పుల కుప్పగా రాష్ట్రం: మంత్రి



ర్యాలీలో మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్ రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పుర ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్

పాలమూరు, న్యూస్‌టుడే : తెలంగాణను అప్పులకుప్పగా మార్చిన భారాస నేతలు.. రాష్ట్రాన్ని బంగారు పల్లెంలో పెట్టి ఇచ్చామని చెబుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో ముడా (మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఛైర్మన్‌గా లక్ష్మణ్ యాదవ్ బాధ్యతలను స్వీకరించిన అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారాస రూ.వేల కోట్లు దోచుకుని దేశంలోని జాతీయ పార్టీల కంటే ఎక్కువగా సంపద పోగేసుకుందని ఆరోపించారు. గత 75 ఏళ్లుగా అనేక పార్టీలు రాష్ట్రాన్ని పాలించినా రూ. 70వేల కోట్ల అప్పే అయ్యిందన్నారు. భారాస పాలనలో రూ. 6.5 లక్షల కోట్ల అప్పు చేశారని దుయ్యబట్టారు. అందుకే నిరంకుశ, కుటుంబ పాలనను ప్రజలు తిరస్కరించి తమకు పాలన అందించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటే కుటుంబ పార్టీ కాదని, బడుగు బలహీన వర్గాలకు చెందిన పార్టీ అని పేర్కొన్నారు. లక్ష్మణ్ యాదవ్ రెండుసార్లు కౌన్సిలర్‌గా ఎంపికయ్యారని, ఆయనతోపాటు గెలిచిన వారంతా వేరే పార్టీలో చేరినా కాంగ్రెస్ జెండానే నమ్ముకొని ఉన్నారని గుర్తుచేశారు. అందుకే పార్టీ సముచిత ప్రాతినిధ్యం ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భారాస ప్రభుత్వం ముడా ఏర్పాటు చేసినా దానికి రూపాయి కూడా మంజూరు చేయలేదని మండిపడ్డారు. ముడాను అభివృద్ధి చేయడానికి ముగ్గురం ఎమ్మెల్యేలం కలిసి ముఖ్యమంత్రి సహకారంతో ఎక్కువ నిధులు తీసుకొస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రూ. 260కోట్ల అమృత్ నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. యాదవులు నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నారని, ప్రాధాన్యమైన పోస్టును యాదవ బిడ్డకు అప్పగించామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జడ్పీ, ఎంపీపీ, పురపాలికల్లో పదవులు అన్ని వర్గాలకు దక్కేలా కృషిచేస్తామన్నారు. తొలుత ముడా కార్యాలయంలో ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్ బాధ్యతలు చేపట్టగా మంత్రి, ఎమ్మెల్యేలు, నేతలు అభినందనలు తెలిపారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి సమావేశం నిర్వహించిన ఏనుగొండలోని జేజేఆర్ గార్డెన్ వరకు భారీ వాహన ర్యాలీతో తరలివెళ్లారు. కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, మల్లు నర్సింహారెడ్డి, ఆనంద్‌కుమార్ గౌడ్, అనిత, ఎన్పీ వెంకటేశ్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, మారేపల్లి సురేందర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, అబ్దుల్ సిరాజ్ ఖాద్రి పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు పరిష్కరించేలా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో తహసీల్దార్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ధరణి పోర్టల్ పెండింగ్‌లో ఉన్న సమస్యలను 15 రోజులలో పరిష్కరించాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి పొరపాట్లకు తావు లేకుండా పరిష్కరించాలన్నారు. కొన్ని సమస్యలు తహసీల్దార్, మరికొన్ని ఆర్డీవో స్థాయిలో, కలెక్టర్ స్థాయిలో ఉన్న దరఖాస్తులను పక్కా ప్రణాళికతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా ఇచ్చే ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో లేకుండా తహసీల్దార్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కల్యాణలక్ష్మి దరఖాస్తులు జిల్లాలో 700 వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తమ పరిధిలో ఉన్న మిల్లులను సందర్శించి ఈనెల 31లోపు ఎఫ్‌సీఐకి సీఎంఆర్ బియ్యంను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైస్ మిల్లులో ఉన్న స్టాక్ వివరాలను రోజు వారీగా బియ్యం వివరాలను తనకు ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, ఏవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక పనులు చేస్తే చర్యలు తప్పవు

దేవదారికుంట తండా కార్డెన్ సెర్చ్‌లో ఏఎస్పీ రామేశ్వర్



దేవదారికుంట తండాలో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : చట్టవ్యతిరేక పనులు చేసే వారిపై చర్యలు తప్పవని ఏఎస్పీ రామేశ్వర్ అన్నారు. మండలంలోని దేవదారికుంట తండాలో బుధవారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డివిజన్‌లోని పోలీసులు బృందాలుగా విడిపోయి ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. 65 ద్విచక్రవాహనాలు, 4 ఆటోలు, 4 ట్రాక్టర్లు, ఒక కారును పట్టుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. కాగితాలను చూపని వాటిని జప్తు చేస్తామన్నారు. ఎక్సైజ్ అధికారులతో కలిసి నాలుగు చోట్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. వాహనాలకు సంబంధించిన అన్ని కాగితాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. యువకులు మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గంజాయి వంటి వాటికి యువత అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గ్రామాలకు వీటిని రవాణా చేస్తే వారి సమాచారం పోలీసులకు చెప్పాలన్నారు. దుందుభి నదీ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో ఇసుక డంపులున్నాయని అక్కడి ట్రాక్టర్లకు నంబర్లు లేకుండా ఉన్నాయన్నారు. వీటి వివరాలను ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు. సైబర్ క్రైం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు చెప్పారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాసులు, సీఐలు రవీందర్, శంకర్, అచ్చంపేట ఎక్సైజ్ సీఐ సుబ్రమణ్యం, ఎస్సైలు వెంకట్‌రెడ్డి, రమేశ్, పవన్‌కుమార్, రాజు, ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత



పాఠశాల పతాకాలతో క్రీడా సారథులు

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : చదువులతో పాటు క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పుర అధ్యక్షుడు ఎడ్మసత్యం అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి గురుకుల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించేందుకు నిత్య సాధన చేయాలన్నారు. చిన్నతనం నుంచే గెలుపు ఓటములను అలవర్చుకుంటే జీవితంలో ఎలాంటి ఒడిదొడుకులు వచ్చినా తట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. పోటీలు నిర్వహించడం వల్ల ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్తుండటంతో అక్కడి పరిస్థితులు తెలుస్తాయని కొత్త మిత్రులు ఏర్పడతారన్నారు. ఓటమి చెందామని నిరుత్సాహపడకుండా గెలుపు కోసం ప్రయత్నించి క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. అంతకు ముందు విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించి క్రీడా జ్యోతిని వెలిగించారు. పోటీలను ప్రారంభించి విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 16 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీవో వెంకట్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమాశాఖ అధికారి ఖాజా నజీంఆలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డా. నాగమణి, విశ్రాంత ప్రిన్సిపల్ కేశవులు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న కల్వకుర్తి పుర అధ్యక్షుడు ఎడ్మ సత్యం, అధికారులు

పల్లెలు అభివృద్ధి చెందితేనే గ్రామ స్వరాజ్యం

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే: పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని కొండనాగులలో రూ. 25 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనం, రూ. 10 లక్షలతో ముస్లిం మైనార్టీ సముదాయ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. శిథిలావస్థకు చేరిన బీసీ బాలుర వసతీ గృహాన్ని పరిశీలించి, నూతన భవన నిర్మాణానికి రూ. 3.5 కోట్లను మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయి అధికారులు పారిశుద్ధ్య నిర్మూలన, సంక్షేమం కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ అరుణ, పంచాయతీ కార్యదర్శి మధు, నాయకులు పాల్గొన్నారు.

భూసేకరణ పనులను వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో కేఎల్ఐ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి భూసేకరణ పూర్తి చేయాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూముల వివరాలను ఈనెలలోపు ఇవ్వాలన్నారు. కేఎల్ఐ కింద ప్యాకేజీ 29లో 132 ఎకరాల భూమి సర్వే చేయాల్సి ఉందన్నారు. నీటిపారుదల శాఖ, ఏజెన్సీలు కలిసి భూముల యజమానులతో మాట్లాడాలని సూచించారు. సర్వే పనులపై మండలం, గ్రామాల స్థాయిలో నివేదికలు సిద్ధం చేయాలన్నారు. సర్వేపై ప్రతి వారం సమీక్ష చేస్తానని చెప్పారు. క్షేత్ర స్థాయిలో వస్తున్న సమస్యలను అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తాను క్షేత్ర స్థాయికి వచ్చి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ అరుణ, నీటిపారుదల శాఖ సీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈలు, డీఈలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రేపటి శాస్త్రవేత్తలకు చక్కని అవకాశం

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ దరఖాస్తులకు ఆహ్వానం

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్ : విద్యార్థులు బృందంగా, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ప్రాజెక్టులు రూపకల్పన చేసేలా కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్' పేరుతో 2024-25 సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నీతి ఆయోగ్, ఏటీఎల్ ఇన్నోవేషన్ మిషన్, యూనిసెఫ్, కేంద్ర పరిధిలోని ఇన్నోవేషన్ విభాగం, ఏఐసీటీఈ సహకారంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిపై ఇప్పటికే జిల్లా సైన్సు అధికారులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది దోహదపడుతుందని గద్వాల జిల్లా సైన్సు అధికారి బాస్కర్ పాపన్న అంటున్నారు.



వివరాలు నమోదు చేసే వెబ్‌సైట్ ముఖచిత్రం

6 నుంచి ఇంటర్ విద్యార్థులకు

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 6 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులందరికీ అవకాశం ఉంటుంది. అయిదు జిల్లాల పరిధిలో మొత్తం 4,500కి పైగా పాఠశాలలుండగా, 190కి పైగా ఇంటర్ కళాశాలలున్నాయి. 6 నుంచి 10వ తరగతి వరకు 2.40 లక్షల మంది, ఇంటర్‌లో 35 వేల మందికి పైగా ఉన్నారు. వీరంతా పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఒక్కో పాఠశాల నుంచి బృందంగా విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పన చేయాలి. ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే బృందంలో ఉండాలి. schoolinnovation-marathon.org అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే.. విద్యార్థులు, ఉపాధ్యాయునికి ఎంట్రీ కోర్సు నిర్వహిస్తారు. తరువాత వారి ఆలోచనలు అందులో పొందుపరచాల్సి ఉంటుంది.


మానవపాడు ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

తేదీలు, ఎంపికలు

నవంబరు 30 నాటికి ప్రాజెక్టు రూపకల్పన చేసి దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలి. వాటిని పరిశీలించి 2025 జనవరిలో 1000 మంది విజేతలను ప్రకటిస్తారు. మేలో విజేతలకు బహుమతులు అందిస్తారు. జులై 29న దేశవ్యాప్తంగా నిర్వహించే అటల్ ఇన్నోవేషన్ షోలో పాల్గొనాల్సి ఉంటుంది.

● ప్రతి రాష్ట్రం నుంచి 20 బృందాలను విజేతలుగా ప్రకటిస్తారు. ఇంకా 20 బృందాలను గ్రామీణ ప్రాంతాల నుంచి, 20 బృందాలను ప్రభుత్వ పాఠశాలల నుంచి, 20 బృందాలను ఉమ్మడి జిల్లా నుంచి, ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించి 20 బృందాలను ఎంపిక చేయనున్నారు.


సామాజిక సమస్యలపై

ప్రాజెక్టులు సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలి. ఇప్పటికే పరిష్కారం కనుగొని ఉంటే. . ఇంకా మెరుగైన పరిష్కారాలు సూచించేలా ఉండాలి. ఎంపికైన విద్యార్థులకు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక బహుమతులు, ఉన్నత విద్యకు సహకారం అందనుంది.

కన్నవారే భారమా..!

తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు

సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేస్తున్న సర్కారు



మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ వృద్ధుడికి ముగ్గురు కుమారులున్నారు. ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో జనరల్ ఆస్పత్రిలోని పెద్దలోనే ఉంటూ దాతలు పెట్టే అన్నం తింటూ బతికారు. ఇటీవల అనాథలా మరణించారు. అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు కుమారులు ముందుకు రాలేదు. చివరకు సామాజిక వర్గం పెద్ద మనుషులు జోక్యం చేసుకోవటంతో ఓ కుమారుడు అంత్యక్రియలు నిర్వహించారు. నవాబ్‌పేట మండలానికి చెందిన ఓ వృద్ధురాలు కుమారులు పట్టించుకోకపోవటంతో పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చింది.

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

ఎన్నో కష్టాలు పడి కని పెంచిన తల్లిదండ్రుల వృద్ధాప్యంలో భారమని కొందరు పిల్లలు భావిస్తున్నారు. వారి ఆలనా పాలనా చూడకుండా గాలికి వదిలేస్తున్నారు. కొందరైతే వారి ఆస్తిపాస్తులను కూడా తమ పేరిట రాయించుకుని ఏకాకిని చేసి ఇంటి నుంచి గెంటేస్తున్నారు. ముదిమి వయసులో ఉన్న వారికి రెండు పూటలా అన్నం కూడా పెట్టని ఉదంతాలు నిత్యం ఏదో ఒకచోట వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వృద్ధులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై 'న్యూస్‌టుడే' కథనం.


మహబూబ్‌నగర్ జిల్లా జైలు సమీపంలో అనాథగా పడి ఉన్న వృద్ధుడిని తరలిస్తున్న జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది

అండగా చట్టాలు



తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం - 2007 ప్రకారం వయోవృద్ధులైన వారి పోషణ బాధ్యత పిల్లలదే. తమ పోషణ విషయంలో పిల్లలను అడిగే హక్కు తల్లిదండ్రులకు ఉంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973లో సెక్షన్ 125 ప్రకారం తమను పోషించుకోలేని స్థితిలో తల్లిదండ్రులు ఉంటే చట్టమే వారి పోషణకయ్యే ఖర్చులను పిల్లల నుంచి ఇప్పిస్తుంది. తమ పిల్లలపై ఉన్న ప్రేమతో చాలా మంది తల్లిదండ్రులు కేసులు పెట్టడం లేదు. బాధితులైన వృద్ధులకు ప్రభుత్వం చట్ట ప్రకారం ఆసరా కల్పించేందుకు జిల్లా, మండలం, పురపాలిక స్థాయిలో వయోవృద్ధుల సంక్షేమ కమిటీలు (సీనియర్ సిటిజన్ కమిటీలు) ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది.

ఆదుకునే అధికారులు..

జిల్లా స్థాయి సీనియర్ సిటిజన్ కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్ ఉంటారు. సభ్యులుగా ఎస్పీ, జిల్లా వైద్యాధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి, సీనియర్ సిటిజన్లు (ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు), ఇద్దరు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉంటారు. మండల స్థాయి కమిటీ ఛైర్మన్‌గా తహసీల్దారు ఉంటారు. సభ్యులుగా ఎంపీడీవో, ఎస్సై, వైద్యాధికారి, ఇద్దరు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు లేక ఇద్దరు సీనియర్ సిటిజన్లు, ఏపీఎం, ఏసీడీపీవో, సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు ఉంటారు. పురపాలికల స్థాయి కమిటీలో కమిషనర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా మెప్మా పీడీ, సీఐ, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, సీడీపీవో, ఇద్దరు ఎన్‌జీవోల ప్రతినిధులు లేదా ఇద్దరు సీనియర్ సిటిజన్లు సభ్యులుగా ఉంటారు.



ట్రైబ్యునల్‌కు ఫిర్యాదు చేయొచ్చు

ట్రైబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తే పిల్లలకు నోటీసులు పంపించి, విచారణ అధికారుల ద్వారా వాదనలు, సాక్ష్యాలు సేకరిస్తుంది. 90 రోజుల వ్యవధిలో పోషణ ఖర్చుల చెల్లింపునకు ఆదేశిస్తుంది. కేసు పునఃపరిశీలనకు, పోషణ ఖర్చులకు ట్రైబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయొచ్చు. పోషణ ఖర్చులు మూడు నెలల పాటు ఇవ్వకపోతే ఆ వృద్ధులు తిరిగి ట్రైబ్యునల్‌ను ఆశ్రయిస్తే ట్రైబ్యునల్ ఉత్తర్వులను పాటించని పిల్లలు లేదా బంధువులకు జరిమానా లేక జైలు శిక్షణ విధించే అవకాశం ఉంటుంది.



తల్లిదండ్రులు, వయోవృద్ధులను సంతానం పోషించకుంటే ఫిర్యాదు చేయొచ్చు. తాము నివసిస్తున్న లేదా సంతానం నివసిస్తున్న ప్రాంతం ఆర్డీవో ట్రైబ్యునల్‌కు లేదా జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారికి ఫిర్యాదు చేయొచ్చు. పోషణ ఖర్చులు ఇప్పించమని దరఖాస్తు చేసుకోవచ్చు. టోల్ ఫ్రీ నంబర్ 14567లోనూ అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

ఆస్తిపాస్తులు ముందే రాసివ్వొద్దు..



చాలా మంది తల్లిదండ్రులు తాము జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తిపాస్తులను పిల్లల పేరిట రాసిస్తున్నారు. మలి దశలో కంటికి రెప్పలా చూసుకుంటారని భావిస్తే పిల్లలు తల్లిదండ్రులను ఇంటి నుంచి గెంటేస్తున్నారు. తొందరపడి తల్లిదండ్రులు తమ ఆస్తిని ముందే వారి పేరిట బదలాయించొద్దని న్యాయమూర్తులు, అధికారులు సూచిస్తున్నారు. తల్లిదండ్రులకు ఆస్తిపాస్తులుంటే, వారికి సేవలు చేస్తే తదనంతరం ఎలాగూ వారసత్వంగా పిల్లలకే సంక్రమిస్తాయని వారు చెబుతున్నారు. వృద్ధుల పేరిట ఆస్తి ఉంటే పిల్లలు పోషణ విషయంలో పట్టించుకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

కమిటీలు న్యాయం చేస్తాయి..



జిల్లా స్థాయిలో రెండేళ్ల క్రితమే కమిటీలు ఏర్పాటయ్యాయి. మండల స్థాయిలో దాదాపు అన్ని చోట్ల ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం పురపాలికల్లో కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. పిల్లలు పట్టించుకోని తల్లిదండ్రులు ఈ కమిటీలను ఆశ్రయిస్తే న్యాయం చేస్తాయి.

- జరీనా బేగం, జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమాధికారి, మహబూబ్‌నగర్

విద్యావంతులే నిర్లక్ష్యం చేస్తున్నారు



వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్న వారిలో విద్యావంతులు, ఉన్నతోద్యోగులైన పిల్లలే ఎక్కువగా ఉంటున్నారు. పింఛన్లు వస్తున్న తల్లిదండ్రుల ఏటీఎం కార్డులు లాక్కుంటున్నారు. బ్యాంకు రుణం తీసుకుంటున్నామని సంతకాలు చేయించుకుని ఆస్తి తమ పేరిట రాయించుకుని పట్టించుకోవడం లేదు. చాలా కేసులు మా దృష్టికి రాగా కూర్చోబెట్టి పరిష్కరించాం. రెండు, మూడు కేసులు మాత్రం కలెక్టర్, ఎస్పీల ద్వారా ట్రైబ్యునల్ వరకు వెళ్లాయి.

- ఎస్.జగపతి రావు, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు, మహబూబ్‌నగర్



పడవల్లో ప్రయాణం.. పొంచి ఉన్న ప్రమాదం

నదీ విహారం, ప్రయాణాల్లో లైఫ్ జాకెట్లు తప్పనిసరిగా ధరించాలని చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారు. అధికార యంత్రాంగం ఎంతగా అవగాహన కల్పించినా అటు ప్రజల్లో, ఇటు బోట్ల యజమానుల్లో మార్పు రావడం లేదు. చాలాచోట్ల నదిలో ప్రమాదాలు చోటు చేసుకుని పదుల సంఖ్యలో వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం సోమశిల వద్ద కృష్ణానది నిండుకుండను తలపించేలా ప్రవహిస్తోంది. ఇక్కడ లైఫ్ జాకెట్లు ధరించకుండానే ప్రమాదకరంగా నదీ ప్రయాణం చేస్తున్న దృశ్యాన్ని 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

కాలుష్యమయం.. రోగాల భయం!



నదిలో స్నానమాచరిస్తే పుణ్యం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. కొల్లాపూర్ మండలంలోని సోమశిల వద్ద కృష్ణానదిలో స్నానం చేస్తే పుణ్యం మాట దేవుడెరుగు రోగాలు వస్తాయేమోనని ప్రజలు భయపడుతున్నారు. సోమశిల వద్ద కృష్ణానదిలోని పవిత్ర జలాలు కలుషితమవుతున్నాయి. పుష్కర ఘాట్ల వద్ద నీరు ఆకుపచ్చ రంగులో చమురు తెట్టు కట్టినట్లు దర్శనమిస్తుంది. అక్కడికి వచ్చే పర్యాటకులు ఆ నీటిని చూసి పుణ్యస్నానం చేసేందుకు జంకుతున్నారు. కాళ్లను కడుక్కుని నదికి నమస్కరించి దీపాలు వదిలి దైవ దర్శనానికి వెళ్లిపోతున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో రాజీలేని పోరాటం చేస్తామని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని సింగిల్ విండో సమావేశం హాల్‌లో టీజీవో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గెటిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అయిదు డీఏలను విడుదల చేయాలన్నారు. జీవో నంబరు 317 సమస్యలను పరిష్కరించాలని, సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న 144 మంది తెలంగాణ ఉద్యోగులను వెనక్కి రప్పించాలన్నారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను మంజూరు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా రాజశేఖర్‌రావు, అసోసియేట్ అధ్యక్షులుగా ఖాజామైనోద్దీన్, నాగరాజు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, రాజేశ్‌కుమార్, కార్యదర్శిగా సంజీవను ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గం సభ్యులతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. కొత్త కార్యవర్గంను కలెక్టర్ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

26న మద్దూరులో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన


హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

మద్దూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 26న మద్దూరులో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నర్సిములు తెలిపారు. ఇటీవల మరణించిన పార్టీ నాయకుడు కల్లపు సతీశ్ దినకర్మకు హాజరై, ఆయన కుటుంబ సభ్యులను సీఎం పరామర్శిస్తారని చెప్పారు. బుధవారం కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దారు మోహన్‌గౌడ్, ఎస్ఐ రాంరాల్, కాంగ్రెస్ నాయకులు హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు.

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు


ముఖద్వారానికి రంగులు వేస్తున్న కార్మికులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : పాలమూరు ప్రజల ఆరాధ్యదైవం కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నవంబరు 2 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో దేవాదాయశాఖ, దేవస్థాన పాలక వర్గం బాధ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కంచనగుహపై నిర్మించిన ప్రధాన ఆలయం, లక్ష్మీదేవి, చెన్నకేశవస్వామి, క్షేత్రపాలకులు, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు ముఖద్వారానికి రంగులు, విద్యుదీకరణ పనులు ప్రారంభయ్యాయి. ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి, అర్చకులు వెంకటయ్య, లక్ష్మీనర్సింహ, అనంతవిజయ్ తదితరులు బుధవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భారీగా బందోబస్తు...

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : శ్రీ కురుమూర్తి స్వామివారి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ జానకి తెలిపారు. బుధవారం ఆలయాన్ని సందర్శించి మాట్లాడారు. ఉద్దాల ఉత్సవానికి లక్షల్లో వచ్చే భక్తులకు, స్వామివారి బంగారు ఆభరణాల ఊరేగింపునకు ప్రత్యేక బలగాలతో పాటు, పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్సై శేఖర్ పాల్గొన్నారు.


జాతర మైదానంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

దోశ ముక్క గొంతులో ఇరుక్కొని మృతి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : దోశ తింటుండగా ఒక్కసారిగా గొంతులో ఇరుక్కోవడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో నివాసముంటున్న వెంకటయ్య (43) ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. 11 గంటల సమయంలో హోటల్ నుంచి దోశ తీసుకుని ఇంటికి వచ్చాడు. కుటుంబసభ్యుల ముందే తింటున్నాడు. గొంతులో ఇరుక్కోవడంతో నీళ్లు తాగుతుండగానే పక్కకు ఒరిగిపోయాడు. కళ్లెదుటే ప్రాణాలు వదలడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వెంకటయ్యకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.


వెంకటయ్య (పాతచిత్రం)

విద్యుదాఘాతానికి వృద్ధురాలు..


గోవిందమ్మ

రాజోలి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై రాజోలి గ్రామానికి చెందిన గోవిందమ్మ(62) మృతిచెందింది. స్నానం చేయడానికి బాత్‌రూమ్‌లో వాటర్ హీటర్ పెట్టబోయింది. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. ఇంట్లో ఉన్న వారంతా గృహ ప్రవేశానికి వెళ్లడంతో ఎవరూ గమనించలేదు. పక్కింటి వ్యక్తి గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే వృద్ధురాలు మృతిచెందింది.

కోడి పందాలపై పోలీసుల కొరడా

12 కోడి పుంజులు.. 21 ద్విచక్రవాహనాలు స్వాధీనం

కోడేరు, న్యూస్‌టుడే : కోళ్ల పందెం ఆడుతుండగా సమాచారం రావడంతో స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి 12 కోడి పుంజులు, 21 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల బాడుగదిన్నె శివారులో చోటు చేసుకుంది. ఎస్సై గోకారి కథనం ప్రకారం.. వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 70 మందికిపైగా ద్విచక్రవాహనాలపై బాడుగదిన్నె శివారు పొలం వద్దకు చేరారు. రహస్యంగా కోడి పందాలు ఆడుతున్నారు. ఈ విషయంపై డయల్ 100కు సమాచారమందింది. ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ వెంటనే కొల్లాపూర్ సీఐ మహేశ్‌ను అప్రమత్తం చేశారు. దీంతో ఆయన కొల్లాపూర్, కోడేరు పోలీసులతో బృందంగా ఏర్పడి కోడి పందాలు ఆడుతున్న స్థావరంపై దాడులు నిర్వహించగా పందెంరాయుళ్లు పరారయ్యారు. 12 కోడిపుంజులు, 21 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని కోడేరు ఠాణాకు తరలించారు. ఈ ఘనటపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోకారి తెలిపారు. ఎలాంటి నగదు లభ్యం కాలేదని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: ఒకరి మృతి

కోస్గి గ్రామీణం : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన గుండుమాల్ బుధవారం చోటు చేసుకుంది. బైక్‌మెకానిక్ కృష్ణయ్య రాత్రి దుకాణంలో పనులు ముగించుకొని ఇంటికి బయలుదేరాడు. మద్దూరు మండలం దోరెపల్లికి చెందిన మోహన్ తన ద్విచక్రవాహనంపై గుండుమాల్ వస్తున్నారు. ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తున్న కృష్ణయ్యను ఢీకొట్టాడు. కృష్ణయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. గాయాల పాలైన మోహన్‌ను కోస్గి ఆసుపత్రికి తరలించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

చెంచుల అభ్యున్నతికి చేయూత

లింగాల, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాల్లో నివాసం ఉంటున్న చెంచుల్లో అక్షరాస్యత తక్కువ ఉన్నందుకు.. అభివృద్ధి సాధించ లేకపోతున్నారని ఎన్ఆర్ఐ ఝాన్సీ లక్ష్మి అన్నారు. నైస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఎర్రపెంటలో బుధవారం చెంచులకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. చెంచులు మద్యం తదితర దురవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి కుటుంబానికి రూ.3,500 విలువైన సరకులు అందజేశామని మొత్తం 80 మందికి లబ్ధి చేకూరిందని సంస్థ కార్యదర్శి పూర్ణచంద్రారావు వివరించారు. 5 ఏళ్లపాటు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ రాధ, మోక్ష తదితరులు పాల్గొన్నారు.


చెంచులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎన్ఆర్ఐ ఝాన్సీలక్ష్మి, నైస్ సంస్థ కార్యదర్శి పూర్ణచంద్రారావు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిట్యాల మహాత్మ జ్యోతి బా పులే బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రిన్సిపల్ గురువయ్యగౌడ్‌తో కలిసి చిన్నారెడ్డి క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో, చదువులో నైపుణ్యాన్ని, చిత్తశుద్ధిని ప్రదర్శిస్తే తమ లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ క్రీడాకారులు ఎంపిక కావాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన క్రీడా వందనాన్ని స్వీకరించారు. అనంతరం వాలీబాల్ క్రీడా ప్రారంభోత్సవం వాలీబాల్‌ను త్రో చేసి విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ సొసైటీ అధికారి హర్షవర్ధన్‌రెడ్డి, హాకీ వ్యాయామ డైరెక్టర్ కుమార్, ఎస్‌ఎంఎస్ ఛైర్మన్ రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

ఎక్లాస్‌పూర్ అడవుల్లో చిరుతల సంచారం

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ ఎకో పార్కు పరిసరాల్లో చిరుతలు సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. 250 ఎకరాలకు పైగా అటవీప్రాంతం కోయిలకొండ వరకు గుట్టలు, చెట్లతో విస్తరించి ఉంది. ఇటీవల లేగదూడలు, మేకలు, ఆవులను చిరుతలు చంపుతున్నాయి. ఎకో పార్కులో ఓ చిరుత సంచరించడం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. బుధవారం ఎకో పార్కు కమాన్ వద్ద బొమ్మ చిరుత వద్దకు అసలైన చిరుత చేరుకుని కాసేపు అక్కడే నిలిచిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' అటవీ శాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డితో ప్రస్తావించగా చిరుత సంచారం వాస్తవమేనన్నారు. ఎకో పార్కు అటవీ ప్రాంతంలో దాదాపు 10 నుంచి 15వరకు చిరుతలు ఉన్నట్లు ఆయన తెలిపారు. రైతులు, ప్రజలు ఒంటరిగా వెళ్లవద్దన్నారు. రాత్రి వేళల్లో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు

నాగర్‌కర్నూల్	7993300530
అచ్చంపేట	8008573927
కల్వకుర్తి	9908803650
కొల్లాపూర్	8008573870



? కొల్లాపూర్ పట్టణంలోని ఎస్‌బీహెచ్ ఎదుట ప్రధానరోడ్డుపై మూలమలుపు వద్ద స్తంభం ప్రమాదకరంగా ఉంది. నిత్యం బస్సులు, ద్విచక్రవాహనాలు, ఆటోలు పాఠశాల విద్యార్థులు, బ్యాంకు ఖాతాదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదాలు జరగక ముందే స్తంభం తొలగించాలి. - పులిభరత్

✓ వెంటనే పరిశీలించి విద్యుత్తు స్తంభం తొలగించే ఏర్పాట్లు చేస్తాం. - రాకేశ్‌రెడ్డి, కొల్లాపూర్ ఏఈ

- న్యూస్‌టుడే, కొల్లాపూర్ పట్టణం

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రవి : దేవర
రమణ : వేట్టయన్ దహంటర్, రామకృష్ణ :
ఇద్దరు, కల్వకుర్తిలో.. పార్థసారథి : దేవర
అశోక్ : వేట్టయన్ దహంటర్

అందని కిట్లు.. అంతంతమాత్రంగా ఆరోగ్యం

కందనూలు, కల్వకుర్తి పట్టణం న్యూస్‌టుడే : జిల్లాలోని పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై అధికారులు దృష్టి సారించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్మికులకు ఏటా ఒకసారి రక్షణ కిట్లు, దుస్తులు, వివిధ రకాల పరికరాలు పంపిణీ చేయాలని పాలకవర్గ సమావేశాల్లో తీర్మానాలు చేస్తున్నారు. నిధుల కేటాయింపు కాగితాలకే పరిమితమవుతోంది. జిల్లాలోని నాలుగు పురపాలక సంఘాల పరిధిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై 'న్యూస్‌టుడే' కథనం.

తెల్లవారుజామున 5 గంటలకే హాజరు : జిల్లాలోని కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ పురపాలక సంఘాల పరిధిలో కలిపి మొత్తం 401 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. వీరు రోజు తెల్లవారు జామున 5 గంటలకు విధులకు హాజరై పట్టణాల్లోని రహదారులు, మురుగుకాలువలు శుభ్రం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఆటోల ద్వారా చెత్త సేకరిస్తున్నారు. మురుగు కాల్వల వద్ద, ఇళ్ల మధ్య ఉన్న పిచ్చి మొక్కలను, కంప చెట్లను తొలగిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పురపాలక సంఘాలు మెరుగైన ర్యాంకులు సాధించడానికి పారిశుద్ధ్య సిబ్బంది కృషి చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా కార్మిక చట్టాల నిబంధనల ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి సంవత్సరంలో ఒకసారి రెండు జతల చొప్పున దుస్తులు, రక్షణ పరికరాలు, పనిముట్లు, చేతులకు తొడుగులు, కాళ్లకు ... టిక్ కిట్లు, దుస్తులు అందించడం లేదు. ప్రతి ఆరు నెలలకోసారి ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించాల్సి ఉన్నా... అదీ నెరవేరడం లేదు. ఎలాంటి సామగ్రి ఇవ్వకపోవడం వలన కార్మికులు ఎలాంటి రక్షణ లేకుండా పని చేస్తున్నారు. దీని వలన అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురపాలక సంఘ అధికారులు కార్మికుల సమస్యలు తెలుసుకోవడానికి ప్రతి నెల సమావేశాలు నిర్వహించాలని నిబంధనలున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. దీని వలన కార్మికులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు.

పుర పారిశుద్ధ్య కార్మికులకు అవస్థలు



నాగర్‌కర్నూల్ : రాంనగర్ కాలనీలో చేతులకు తొడుగులు లేకుండా చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

పురపాలక సంఘం	కార్మికులు
నాగర్‌కర్నూల్	120
అచ్చంపేట	116
కల్వకుర్తి	102
కొల్లాపూర్	63

అమలుకు నోచుకోని తీర్మానాలు : నాగర్‌కర్నూల్ పురపాలక సంఘంలో సెప్టెంబర్ 25న నిర్వహించిన సాధారణ సమావేశంలో కార్మికులకు పీపీఈ కిట్లు, రెండు జతల దుస్తులు, వివిధ రకాల సామగ్రి కలిపి మొత్తం రూ. 5 లక్షల నిధులు కేటాయించి తీర్మానం చేశారు. దసరా పండుగ రోజున పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నా ఇప్పటి వరకు కార్మికులకు ఎలాంటి కిట్లు, దుస్తులు అందజేయలేదు. కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి పురపాలక సంఘాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

చర్యలు తీసుకుంటాం..

పారిశుద్ధ్య కార్మికులకు దీపావళి పండుగకు దుస్తులు అందజేస్తాం. గతంలో కిట్లు అందజేశాం. కార్మికులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు చర్యలు తీసుకుంటాం. - నరేశ్‌బాబు, పురపాలిక కమిషనర్, నాగర్‌కర్నూల్

ముందుకు సాగని వరినాట్లు

లింగాల, అచ్చంపేట, న్యూస్‌టుడే : మండలవ్యాప్తంగా 20 రోజులకు పైగా కురుస్తున్న వర్షాలకు యాసంగి వరినాట్లు ముందుకు సాగని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలవ్యాప్తంగా యాసంగిలో సుమారు 10వేలకు పైగా ఎకరాల్లో వరినాట్లు వేయాల్సి ఉంది. 30శాతం కూడా నాట్లు కాలేదు. వరినాట్లు వేసిన కొద్ది రోజులకే వర్షాలతో వరినారు కొట్టుకు పోయింది. కొన్ని చోట్ల నారుపై ఇసుక మేట వేయడంతో రైతులు నష్టపోతున్నారు. మొక్క జొన్న ఆరబెట్టేందుకు వాతావరణం అనుకూలంగా లేక ధర రాక ఏం చేయాలో తోచడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లింగాల : ఓ పొలంలో నేలకు ఒరిగిన వరినారు

చట్టాలపై అవగాహనతోనే న్యాయం

వెల్దండ, న్యూస్‌టుడే: చట్టాలపై అవగాహనతోనే న్యాయం పొందగలమని, సమస్యల పరిష్కారం సాధ్యమని కల్వకుర్తి డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జ్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం వెల్దండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలాంటి సమస్యలున్నా.. విద్యార్థులు షీ టీమ్‌ను సంప్రదించాలన్నారు. ప్రిన్సిపల్ గోపాల్‌రావు, ఎస్‌ఎస్ పీవో శివప్రసాద్, అధ్యాపకులు విజయలక్ష్మి, వీనా, అంజయ్య, రమేశ్, షణ్ముఖ రెడ్డి, నవీన్, శివశంకర్, భరత్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో పని చేయించడం నేరం



కూలీలను తరలిస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

తాడూరు, న్యూస్‌టుడే : బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపకుండా పనికి తీసుకెళ్లడం చట్టరీత్యా నేరమని జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీవో) శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలోని ఠాణా ముందు కల్వకుర్తి - నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిపై బుధవారం బాలల సంరక్షణ అధికారులు, చైల్డ్‌లైన్ 1098 సిబ్బంది, స్థానిక పోలీసులు సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేశారు. వివిధ మండలాల నుంచి తాడూరు మండలానికి వ్యవసాయ కూలీలను తరలిస్తున్న పలు వాహనాలను తనిఖీ చేసి పొలం పనులకు వెళ్తున్న పది మంది విద్యార్థులను గుర్తించారు. పిల్లలతో పని చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు, వాహనదారులకు బాలకార్మిక చట్టంపై అవగాహన కల్పించారు. చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ నరేశ్, ఎస్సై గురుస్వామి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆంజనేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బహుజన ఉద్యోగులకు అన్యాయం

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 సంఖ్య ప్రకారం బహుజన ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని ధర్మ బీజేఆర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి నిరంజన్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం బహుజన ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి జీవో పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ హక్కులను కాలరాయడానికి ప్రయత్నాలు చేయడం సరైన విధానం కాదన్నారు. జీవో నంబరు 55 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జానయ్య, సురేశ్, ఈశ్వర్, లక్ష్మణ్, లక్ష్మణ్, బాలరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కూరగాయల ధరలు కిలో.. రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాటా 64, వంకాయ 60, బెండ 64, మిరప 90, కాకర 64, బీర 58, క్యాలిఫ్లవర్ 74, క్యాబేజీ 45, క్యారెట్ 64, దొండ 50, ఆలుగడ్డ 45, గోకర 64, దోస 45, ఆనంకాయ 18, చిక్కుడు 64, మునగకాయ 74, బీట్‌రూట్ 50, ఖీర, 45, బీన్స్ 98.

కార్యదర్శులు పల్లెలో అందుబాటులో ఉండాలి

వంగూరు, న్యూస్‌టుడే : పంచాయతీ కార్యదర్శులు పల్లెలో అందుబాటులో ఉండి సమస్యలు లేకుండా చేయాలని ఎంపీడీవో విజయభాస్కర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి పల్లెలో ఉన్న వన నర్సరీల్లో విరివిగా మొక్కలు పెంచాలన్నారు. పల్లెలో ఎలాంటి సమస్యలు లేకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని చెప్పారు. మురుగుకాలువలను శుభ్రం చేయించి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరగా చేసి కూలీలకు డబ్బులు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో వెంకటేశ్, ఏపీవో శివశంకర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : వర్షాలు కురుస్తున్నందున రోగాలు దరిచేరకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక వైద్యాధికారి డా. ఇస్మాయిల్ సూచించారు. బుధవారం మండలంలోని పుల్లగిరి శివారు తండాలో డెంగీ కేసు నమోదు అయిన విషయాన్ని తెలుసుకున్న ఆయన తండాలను సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. నీటి నిల్వ, మురుగు ప్రవాహం లేకుండా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. జ్వరాలు వస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తండాలోని ఇళ్లల్లో నిల్వఉన్ననీటిని పారబోయించడంతో పాటు మురికి ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఆయన వెంట డాక్టర్ హరిప్రియ, పీహెచ్‌సీ సిబ్బంది బాల్‌రాజ్, ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలున్నారు.



పుల్లగిరి తండాలో వృద్ధురాలికి అవగాహన కల్పిస్తున్న వైద్యులు

అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించాలి



పురపాలిక కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో చోటు చేసుకున్న కోటి రూపాయల అవినీతిపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ దృష్టి సారించి పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు బుధవారం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 15 రోజుల క్రితం అవినీతి వెలుగులోకి వచ్చిన జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అవినీతికి పాల్పడిన అధికారులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించాలన్నారు. 24 గంటల్లోపు అధికారులపై చర్యలు తీసుకోకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతామని హెచ్చరించారు. అనంతరం వినతి పత్రాన్ని పురపాలక సంఘం కార్యాలయ గోడకు అతికించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పృథ్వీరాజ్, నాగేశ్, మధు, బాల నాగయ్య, నాగరాజు, బాలయ్య, రాజశేఖర్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నతి సాధ్యం

అచ్చంపేట, న్యూస్‌టుడే : విద్యార్థులు ప్రణాళికతో చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. జాతీయ స్థాయి ఫ్లయింగ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో విజేతగా నిలిచిన అచ్చంపేట గౌతమి పాఠశాల విద్యార్థులకు బుధవారం ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.మనోహర్, పాఠశాల ప్రతినిధులు విజయకుమార్, రాజేశ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి ఫ్లయింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందిస్తున్న ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ

లింగాల ఎస్సైగా నాగరాజు



లింగాల, న్యూస్‌టుడే : లింగాల ఎస్సైగా నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న నాగరాజును బదిలీ చేస్తూ పోలీస్ ఉన్నతాధికారుల ఉత్తర్వులిచ్చారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై జగన్‌మోహన్ వనపర్తి ఎస్పీ కార్యాలయానికి వీఆర్‌గా బదిలీ చేశారు.

ఏఈవోల సస్పెన్షన్ సరికాదు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ఏఈవోలను సస్పెన్షన్ చేయటం తగదని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని భారాస జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సస్పెన్షన్ చేసిన వారిని ప్రభుత్వం బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారాస ప్రభుత్వంలో ఏఈవోలను నియమించిన తర్వాత వ్యవసాయాన్ని పండుగగా మార్చామన్నారు. ఇప్పుడు వారిపై పని భారం మోపటంతో సర్వే పూర్తి చేయలేకపోయారన్నారు. అంతలోనే సస్పెన్షన్ చేయటం సరికాదన్నారు. హైడ్రా గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తే అడ్డుకుంటామన్నారు. నాయకులు బైకని శ్రీనివాస్‌యాదవ్, వెంకటయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే ఎమ్మెల్యేపై ఆరోపణలు

మన్ననూరు (అమ్రాబాద్), న్యూస్‌టుడే : ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే బాల్‌రాజు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సంబు వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని మన్ననూరులో విలేకరులతో మాట్లాడారు. పార్టీలకతీతంగా వంశీకృష్ణ ప్రతి ఒక్కరిని ఆదరిస్తున్నారన్నారు. బాల్‌రాజు ఎమ్మెల్యేగా ఉన్నపుడు పార్టీ వారికే పనులు చేశారన్న అపవాదు ఉందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు జూలూరు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, శివాజీ, హాతీరాం తదితరులు పాల్గొన్నారు.

దుండగులను శిక్షించడంలో నిర్లక్ష్యం తగదు

అచ్చంపేట, న్యూస్‌టుడే : హిందూ ఆలయాలపై దాడులకు పాల్పడుతున్న దుండగులను గుర్తించి శిక్షించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని శబరిమల అయ్యప్ప సేవా సమాజం జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి మండికారి బాలాజీ అన్నారు. స్థానిక అయ్యప్ప దేవాలయం ఆవరణలో వివిధ సంఘాల ప్రతినిధులు దాడులకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. దాడులు కొనసాగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తోందని ఆరోపించారు. సికింద్రాబాద్‌లో చోటు చేసుకున్న సంఘటనకు బాధ్యులను శిక్షించకపోతే ఆందోళనా కార్యక్రమాలను ముమ్మరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు వెంకటేశ్, మహేశ్, రమేశ్‌రావు, ప్రమోద్ ప్రసాద్, పి.రమేశ్, లక్ష్మణాచారి, శ్రీనివాసులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళల సంక్షేమ కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు రూ. 500లకు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు నేరుగా క్యాంప్ కార్యాలయానికి వచ్చి సమస్యలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణరావు, కర్ణాకర్ రెడ్డి, నాగేశ్, శ్రీనివాసులు, వివిధ గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం

కందనూలు : నాగర్‌కర్నూల్ పట్టణాన్ని అన్ని రకాల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని నాగనూల్‌లో బుధవారం రూ. 6.70 లక్షల నిధులతో సీసీ రహదారుల నిర్మాణాలకు పనులు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుల్తాన్, నాయకులు కర్ణాకర్‌రెడ్డి, దస్తాగిరి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి

గ్రంథాలయానికి వెళ్లేదెలా?

తాడూరు మండల కేంద్రంలోని గ్రంథాలయ భవనం ముందున్న నిరుపయోగ నీటి తొట్టితో పాఠకులకు ఇబ్బందులు ఇబ్బందులు తప్పడం లేవు. భవన ప్రధాన ద్వారం ఎదుటే నీటితొట్టి ఉండటంతో రాకపోకలకు ఆటంకంగా మారింది. పక్కన ఉన్న ఇరుకు ప్రాంతం నుంచి పాఠకులు వెళ్లాల్సిన పరిస్థితి. గ్రంథాలయ భవన నిర్మాణం కంటే ముందే అక్కడ నిర్మించిన నీటితొట్టి వినియోగంలో ఉండటంతో అప్పట్లో అధికారులు దాన్ని తొలగించలేదు. క్రమంగా నీటితొట్టి నిరుపయోగంగా మారి చెత్త కుండిలా మారింది. పంచాయతీ కార్యదర్శి పవన్ స్పందిస్తూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

– న్యూస్‌టుడే, తాడూరు



మంచి నీటి సరఫరాపై అవగాహన



కోడేరులో బోరు బావి మోటర్ స్టార్టర్‌పై అవగాహన కల్పిస్తున్న మెకానిక్ షఫీ, పక్కన ఏఈ బాలరాజు

కోడేరు, న్యూస్‌టుడే : గ్రామాల్లో స్వచ్ఛమైన మంచి నీటి సరఫరా ప్రజలకు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మిషన్‌భగీరథ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలో పని చేసే మంచి నీటి సరఫరా సహాయకులకు మండల స్థాయిలో రెండో రోజు శిక్షణ కార్యక్రమం కొనసాగించారు. రోజులు బారు బావుల వద్ద ఏర్పాటు చేసిన స్టార్టర్లలో వచ్చే సమస్యలు ఎలా పరిష్కరించాలి, పంపు సెట్లలో చిన్న చిన్న సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మెకానిక్ షఫీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రిడ్ ఏఈ శ్రావణ్, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని చైల్డ్‌కేర్ హెల్ప్‌లైన్ బాధ్యులు కవిత అన్నారు. బుధవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఆపద సమయంలో 1098 నంబర్‌కి సమాచారమివ్వాలన్నారు. 18 ఏళ్లు పూర్తయిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. షీ టీం సభ్యురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో మోసాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన వ్యవసాయ కమిషన్ సభ్యుడు

వంగూరు, న్యూస్‌టుడే : పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మంద పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధుల అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు.. బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే: బల్మూర్ గ్రామ పంచాయతీలో నిధుల అక్రమాల పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు పౌర, మానవ హక్కుల సంస్థ జిల్లా ఇన్‌ఛార్జి శివప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీలో 2013 నుంచి 2024 వరకు ఖర్చు చేసిన నిధులపై సహచట్టం ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా దస్త్రాలను పరిశీలించామని పేర్కొన్నారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎలాంటి తీర్మానాలు లేవన్నారు. పారిశుద్ధ్య సామగ్రి కొనుగోలుకు బిల్లులలో అక్రమాలు జరిగినట్లు గుర్తించిన నివేదికలను అందజేసినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో జరిగిన అవినీతి అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సైబర్ నేరంపై కేసు నమోదు.. ఉప్పునుంతల, న్యూస్‌టుడే : సైబర్ నేరానికి సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు. గట్టుకాడిపల్లి గ్రామానికి చెందిన కె.సురేశ్‌రెడ్డి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు నుంచి ఓ ప్రముఖ కంపెనీ పేరిట రూ. 2.49 లక్షలు సెప్టెంబర్ 25 నుంచి 30వ తేదీ వరకు మాయమయ్యాయని చెప్పారు. ఓటీపీ అడగకుండానే డబ్బులు ఖాతా నుంచి పోయాయన్నారు. ఈ ఘటనపై ఈనెల 2న సైబర్ పోర్టల్‌కు ఫిర్యాదు చేశానని బాధితుడు పేర్కొన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. వంగూరు, న్యూస్‌టుడే : మండలంలోని డిండిచింతపల్లి వాగు నుంచి కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామానికి చెందిన శివకుమార్ ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను బుధవారం తెల్లవారుజామున తరలిస్తుండగా ఎస్సై మహేందర్ పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించి కేసు నమోదు చేసి డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు.. అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సామాజిక మాధ్యమం వేదికగా కథనాయకుడు బుద్దాదిత్య మొహంతి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల పై కఠిన చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంతోశ్ కోరారు. సంఘటన పై బుధవారం సిఐ రవీందర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజాభిమాన నాయకుడు రాహుల్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే దేశవ్యాప్తంగా ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని పేర్కొన్నారు. లడ్డుయాదవ్, వెంకటేశ్, శివ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు మంజూరు చేయాలి

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం బకాయిల్లో ఉన్న ఉపకార వేతనాలు, బోధనా రుసుములు మంజూరు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆసంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నితిన్, మురళీ, శ్రీకాంత్, శివ, నాగరాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

బిజినేపల్లి, న్యూస్‌టుడే : పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం నందివడ్డెమాన్‌లోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, వారి విషయ సామర్థ్యాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు వేళకు విధులకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుదర్శన్‌గౌడ్, నగేశ్, రాములు, అవంతి తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసాన్ని తెలియజేస్తూ వినతి

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : తిమ్మాజిపేట(గొరిట) పీఏసీఎస్ అధ్యక్షుడు జక్కారఘునందన్‌రెడ్డి పై అవిశ్వాన్ని తెలియజేస్తూ ఏడుగురు డైరెక్టర్లు ఇన్‌చార్జి డీసీవో ఇందిరమ్మకు బుధవారం వినతి పత్రం సమర్పించారు. 13 మంది డైరెక్టర్లకు గాను ఏడుగురు అవిశ్వాన్ని తెలియజేశారు. సంఘంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, వాటిని నిగ్గుతేల్చాలని పేర్కొన్నారు. సంఘం నూతన అధ్యక్షుడి ఎన్నికకు అవకాశం కల్పించాలని కోరారు.

విద్యుత్తు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : విద్యుత్తు ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) డివిజన్ అధ్యక్షుడు విజయభాస్కర్ డిమాండ్ చేశారు. ఈనెల 26న నిర్వహించనున్న మహాధర్నా గోడపత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరయ్య, పురుషోత్తం, తిరుపతినాయక్, శ్రీనివాసులు, సాయిలు, సరిత, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

కోడేరు, న్యూస్‌టుడే : గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎత్తం కాంప్లెక్స్ జీహెచ్‌ఎం ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని ఎత్తం, నర్సాయిపల్లి, కొండ్రావుపల్లి ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఎస్‌ఏ-1 పరీక్ష నిర్వహణ, ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో విద్యార్థులు హాజరు శాతాన్ని పరిశీలించారు. ప్రతి పాఠశాల విద్యార్థుల వివరాలు యూడైఎస్‌ఈలో జీపీ, ఈపీ, ఎఫ్‌పీ వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు

కందనూలు, న్యూస్‌టుడే : ఔషధ దుకాణాల్లో రోగులకు కాలం చెల్లిన మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఔషధ నియంత్రణ అధికారి విశ్వత్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు ఔషధ దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు పాటిస్తూ రోగులకు మందులు విక్రయించాలన్నారు. వైద్యుని రశీదు లేకుండా మందులు విక్రయించవద్దన్నారు.



ఓ ఔషధ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఔషధ నియంత్రణ అధికారి